క్లుప్తంగా

ఖిల్లా రోడ్డుకు మరమ్మతులు



సాక్షి స్పందన

ఇబ్రహీంపట్నం: 65వ నంబర్ జాతీయ రహదారి నుంచి ఖిల్లాకు వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారికి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. 'బూడిద లోడు లారీలతో రోడ్డు గుల్ల' శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు తక్షణమే రోడ్డు మధ్యలో పడిన భారీ గుంతల్లో గ్రావెల్ పరిచి చదును చేశారు. త్వరలో తారు లేయర్‌తో రోడ్డుకు మరమ్మతులు చేస్తామని అధికారులు తెలిపారు. ఇన్నాళ్లు గుంతల రహదారిపై రాకపోకలు సాగించిన కళాశాలల విద్యార్థులు, ఇందిరమ్మ, వసంత కాలనీ ప్రజలు 'సాక్షి' కథనంపై స్పందించిన అధికారుల తీరుపై హర్షం వ్యక్తం చేశారు.

వరద బాధితుల అర్జీలు స్వీకరించాలని వినతి



ఇబ్రహీంపట్నం: కృష్ణానది వరద ముంపునకు గురై నష్టపరిహారం అందని వివిధ గ్రామాల బాధితుల నుంచి మరలా అర్జీలు స్వీకరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. మహేష్ కోరారు. ఈ మేరకు బాధితులతో కలిసి తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి, రెండో విడతలో కూడా అర్హులైన వారు ఎంతోమందికి పరిహారం అందలేదన్నారు. నిజమైన బాధితులకు మరలా అవకాశం కల్పించి పరిహారం అందించాలని కోరారు. పలు గ్రామాల వరద బాధితులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్ 4న ప్రజా హక్కుల ర్యాలీ



నూజివీడు: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు ఇప్పుడు నోరుమెదపడం లేదని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బి.బంగారావు విమర్శించారు. నూజివీడు పట్టణం అమర్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పీపుల్స్ 6 పేరుతో ప్రజలకు సంబంధించిన డిమాండ్లను మనమే లేవనెత్తి ప్రశ్నించాలని, ఆ దిశగా డిసెంబర్ 4న విజయవాడలో తలపెట్టిన ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్ఎస్ఎస్, బీజేపీ చాపకింద నీరులా వ్యాపించేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, అందుకు టీడీపీ, జనసేన సహకరిస్తున్నాయని విమర్శించారు. నాయకులు కల్యాణ్ కృష్ణ, పీక్లానాయక్, ఈశ్వర్, సొంటి నాగేశ్వరరావు, ఐసా నాయకులు ఉన్నం అనిల్, అఖిల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గంపలగూడెం విద్యార్థులు



గంపలగూడెం: రాష్ట్ర స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్. మణికుమార్ ఎంపికయ్యాడు. ఈ నెల 27న అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాలుర టోర్నమెంట్‌లో మణికుమార్ పాల్గొంటాడని ప్రధానోపాధ్యాయుడు క్రిస్టాఫర్ తెలిపారు. ఊటుకూరు సిద్ధార్థ విద్యాలయం విద్యార్థిని ఎం. ఉమశ్రీ బాలికల అండర్-14 కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు చెరుకూరి కృష్ణారావు తెలిపారు. విద్యార్థులను వారు అభినందించారు.

ముమ్మరంగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

ఆగిరిపల్లి: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా కొత్త ఈదర, సగ్గూరు, సురవరం, కొమ్మూరు, ఈదులగూడెం, కృష్ణవరం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశామని ఈఓపీఆర్డీ ఆనందబాబు తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది వీధులను శుభ్రం చేసి, రోడ్ల వెంట ఉన్న చెత్తను తొలగిస్తున్నారని చెప్పారు. రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించామని చెప్పారు.


అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

గర్భిణులకు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించి మాతా శిశు మరణాలను నివారించేందుకు, వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లోనే పిల్లలకు ప్రీ స్కూల్ నిర్వహించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు చాలీచాలని అద్దె భవనాల్లో కొనసాగడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- ఇరుకు గదులు, అరకొర సౌకర్యాలు
- బాలింతలు, గర్భిణుల ఇబ్బందులు
- పలుచోట్ల మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేని వైనం



నూజివీడు పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు పట్టణం, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, నూజివీడు మండలాల్లో 319 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కేవలం 150 చోట్ల మాత్రమే సొంత భవనాలను సమకూర్చారు. 109 కేంద్రాలను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మరో 60 కేంద్రాలు అద్దె లేకుండా ప్రాథమిక పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్నారు. వీటికి అద్దె కింద గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.2 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.6 వేలను ప్రభుత్వం చెల్లిస్తోంది.

వసతులు లేక ఇబ్బందులు

గాలి, వెలుతురు సరిగా లేని ఇరుకు గదుల్లో కొన్నిచోట్ల కేంద్రాలు నిర్వహిస్తుండటంతో కార్యకర్తలు, లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కొన్నిచోట్ల నీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ వంటివి కూడా లేవు. దీంతో కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 17 కేంద్రాలకు నిధుల మంజూరు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించేందుకు 17 కేంద్రాలకు నాడు-నేడు కింద ఒక్కొక్క భవనానికి రూ.16 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. అవి ప్రస్తుతం పలు దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. రెండు చోట్ల స్లాబు దశలో ఉండగా, తొమ్మిది చోట్ల బేస్‌మెంట్ దశలోను, ఐదు చోట్ల పిల్లర్ల దశలోను, ఒకచోట ఫౌండేషన్ దశలోను ఉన్నాయి. వాటిని పూర్తి చేయాల్సిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగు నెలలైనా ఇప్పటివరకు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీనిపై ఎప్పటికి చర్యలు తీసుకుంటారనేది వేచిచూడాలి.

ఇరుకు గదులతో ఇక్కట్లు



అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించాలి. పలుచోట్ల ఇరుకు గదుల్లో అసౌకర్యాల నడుమ వీటిని నిర్వహిస్తుండటంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కిచెన్ గార్డెన్లు పెంచడానికి వీలులేకుండా ఉంది. దీనిపై పాలకులు స్పందించాలి.

– జి.రాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, నూజివీడు

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- వాల్టా చట్టానికి తూట్లు
- ట్రాక్టర్ ఇసుక రూ.3 వేలకు విక్రయం
- సామాన్యులకు అందని ఉచిత ఇసుక

తిరువూరు: పేదలకు ఉచితంగా ఇసుక అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. తిరువూరు మండలంలోని గానుగపాడు, కట్టెలేరులో గత రెండు రోజులుగా అధిక సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుక తోలకాలు జరుపుతున్నాయి. రోజుకు 150కి పైగా ట్రాక్టర్లు 3, 4 ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నాయి. తిరువూరు, గంపలగూడెం, ఎ. కొండూరు మండలాల్లోని ట్రాక్టర్ల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ఇసుక అమ్మకాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం గానుగపాడు గ్రామానికి రక్షిత మంచినీరందించే పంపింగ్ స్కీముకు నిర్ణీత దూరంలో మాత్రమే ఇసుక తవ్వకానికి అనుమతి ఇవ్వాల్సి ఉండగా అధికారుల ఉదాసీన వైఖరితో విచక్షణారహితంగా వాగును తవ్వేస్తున్నారు.

సామాన్యులకు అందని ఉచిత ఇసుక

స్థానికుల అవసరాలకు మాత్రమే సరఫరా చేయాల్సిన ఉచిత ఇసుకను తిరువూరు మండలంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తిరువూరు పట్టణంతో పాటు పలు గ్రామాలకు ఇసుక సరఫరా చేయడానికి ట్రాక్టరు ఇసుకకు అడిగినంత ఇచ్చుకోక తప్పట్లేదని భవన యజమానులు వాపోతున్నారు. ప్రస్తుతం నిర్ణయించిన ధరలతో గతంలో కృష్ణానది నుంచి కొనుగోలు చేసిన ఇసుక కంటే అధికంగా ఖర్చు చేయక తప్పట్లేదని చెబుతున్నారు. గానుగపాడు-చింతలపాడు ఆర్ అండ్ బీ రహదారిలో ఇసుక ట్రాక్టర్ల రాకపోకలతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



గానుగపాడు కట్టెలేరులో ఇసుక తోలకానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

ఆధార్ ప్రత్యేక శిబిరాల నిర్వహణ

నూజివీడు: పట్టణంలోని నాలుగో సచివాలయంలో, మండలంలోని గొల్లపల్లి సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆధార్‌కార్డులోని పేరు, చిరునామా మార్పు, బయోమెట్రిక్ అప్‌డేట్, బాల ఆధార్ నమోదు తదితర సేవలను శిబిరాల్లో అందిస్తున్నారు. ఈ శిబిరాలు ఈ నెల 25 వరకు కొనసాగనున్నాయి.

మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేయాలి..

పట్టణంలో ఒక్కచోట, మండలంలో రెండు చోట్ల మాత్రమే ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు సేవలు అందడం లేదు. పట్టణం, మండలంతో కలిపి దాదాపు 1.50 లక్షల మంది జనాభా ఉండగా రెండు ఆధార్ శిబిరాలు ఎలా సరిపోతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేక శిబిరాలు మరిన్ని పెంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొనసాగిన ఆధార్ శిబిరం

విస్సన్నపేట: ఆధార్ ప్రత్యేక శిబిరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్‌హాల్‌లో బుధవారం రెండో రోజు కొనసాగింది. పలువురు ఆధార్ నమోదు, సవరణలు చేసుకున్నారు. గురువారం వేమిరెడ్డిపల్లి, కొర్లమండ, కలగర, మారేమండ గ్రామాల ప్రజలకు ఆధార్ శిబిరం నిర్వహిస్తామని, ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్‌కే చిన్నరాట్నాలు కోరారు.



సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరం

రీ సర్వే భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



కొర్లమండ గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి



సభలో మాట్లాడుతున్న సర్వేయర్



సబ్బపాడు సభలో అర్జీలు అందజేస్తున్న గ్రామస్తులు

ఆర్డీఓ మాధవి

కొర్లమండ (విస్సన్నపేట): రీ సర్వే భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహించి సంబంధిత రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి త్వరితగతిన సమస్యల పరిష్కరానికి కృషి చేస్తున్నామని ఆర్డీఓ కె. మాధవి తెలిపారు. మండలంలోని కొర్లమండ గ్రామ సచివాలయం వద్ద రీ సర్వే భూ సమస్యలపై గ్రామ సభ బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆర్డీఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అర్జీల స్వీకరణ, నమోదు సక్రమంగా జరగాలన్నారు. దరఖాస్తుదారులకు రసీదు అందజేయాలని చెప్పారు. గ్రామ సభలో వచ్చిన దరఖాస్తులను 15 రోజులలోగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామ సభకు 47 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి తెలిపారు. కార్యక్రమంలో సర్వే డీటీ ఉదయ భాస్కర్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

- సబ్బపాడు(మైలవరం): భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని జిల్లా సర్వే అధికారి త్రివిక్రమ్ అన్నారు. చంద్రగూడెం పంచాయతీ శివారు సబ్బపాడు గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు 24 అర్జీలు వచ్చాయి. డివిజనల్ సర్వే అధికారి హుమాయూన్ బేగ్, అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈనెల 24న టి.గన్నవరం, 25న గణపవరం, 26న చంద్రాల, 28న కీర్తిరాయునిగూడెంలో గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దార్ తెలిపారు.

రెవెన్యూ గ్రామ సభలను వినియోగించుకోవాలి

చాట్రాయి: రెవెన్యూ సభల్లో భూ సమస్యలు పరిష్కారం చేస్తామని మండల సర్వేయర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తగూడెంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రైతులు భూ సమస్యలు ఉంటే ఈ సభల్లో తగిన ఆధారాలతో అర్జీలు అందజేయాలన్నారు. గ్రామసభకు 33 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చల్లగుళ్ల జగన్ మోహనరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- ఆగిరిపల్లి: రైతుల భూ సంబంధ సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యమని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. ఈదులగూడెంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామసభలో భూ సంబంధిత సమస్యలపై 55 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో రీసర్వే డెప్యూటీ తహసీల్దార్ మరియన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడి సభలు సరికాదు

సీపీఎం మండల కార్యదర్శి సుధాకర్

మైలవరం: రెవెన్యూ గ్రామ సభలు మొక్కుబడిగా నిర్వహించడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పుల్లూరు గ్రామ పంచాయతీ శివారు దాసుళ్ల పాలెం గ్రామ సభను రైతులు వాయిదా వేయమని కోరుతూ సభను తిరస్కరించారని చెప్పారు. గ్రామ సభల ఏర్పాటుపై మూడు రోజుల ముందుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించాల్సి ఉందని, సభకు గ్రామస్తులందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. కానీ రెవెన్యూ అధికారులు రాత్రి పూట ఫోన్ చేయడం, పొద్దున్నే గ్రామ సభలు నిర్వహించడం మంచి సంప్రదాయం కాదన్నారు. గ్రామస్తులు పగలు ఇళ్ల వద్ద ఉండే సమయంలో సభలు నిర్వహించాలని సుధాకర్ కోరారు.

దర్బార్‌ను సందర్శించిన ముక్తార్ అలీ షా ఖాదరి



ఎ.కొండూరు: చీమలపాడు ఏఏ ఎంటీకే దర్బార్‌ను బుధవారం మధ్యప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ ముక్తార్ అలీ షా ఖాదరి సందర్శించారు. సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి సమాధి వద్ద చాదర్, పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా షా తాజ్ ఖాదరిని దర్బార్ పీఠాధిపతి మొహమ్మద్ కాజా మొహియుద్దీన్ సత్కరించారు. పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఎస్‌ఐ రామకృష్ణ హెచ్చరిక



చాట్రాయి: యువకులు ఇతరులకు ఇబ్బంది కలిగేలా, శాంతి భద్రతలకు విఘాతం సృష్టించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక వికాస్ కాలేజీ వద్ద అల్లరి చేస్తున్న ఆకతాయిలకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువకులు కేసుల్లో ఉంటే భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఆయన సూచించారు.

సేంద్రియ ఎరువులను వినియోగించాలి



చాట్రాయి: సేంద్రియ ఎరువులను వినియోగించాలని వ్యవసాయ అధికారి బి. శివశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని మర్లపాలెం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ మందులు వాడుతూ, పురుగు మందుల వాడకం క్రమేపీ తగ్గిస్తూ సాగు ఖర్చులు తగ్గించుకోవాలని ఆయన సూచించారు.

భోజనం ప్లేట్ల వితరణ



గంపలగూడెం: రాజవరంలోని అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన ప్లేట్లు, గ్లాసులను షిర్డీ సాయి బాబా సేవా కమిటీ వారు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ వి. శేషిరెడ్డి, వెదురు వెంకటరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు కల్పన, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రధానాధికారి దేవరకొండ భూషణం బుధవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు కాపీ ప్రింటవుట్ తీసుకుని ఈ నెల 27న కళాశాలలో నిర్వహించే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు ఈ నెల 28న కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

నగదు లావాదేవీలను పర్యవేక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గిరిబాబు

తిరువూరు: బ్యాంకుల్లో ఖాతాదారులు జరిపే నగదు లావాదేవీలను మేనేజర్లు పర్యవేక్షించాలని తిరువూరు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విదేశాల్లో చదువుకునే విద్యార్థులు, ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న యువకుల తల్లిదండ్రులకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లు చేసి వారి పిల్లలు కేసుల్లో ఇరుక్కున్నారని, విడిపించేందుకు డబ్బులు పంపాలని డిమాండ్ చేసే ఘటనలు జరుగుతున్నాయన్నారు. బ్యాంకులకు వచ్చి నగదు విత్‌డ్రా చేసే ఖాతాదారులు ఏ అవసరాలకు తీసుకుంటున్నారో గమనించాలని, అనుమానం వస్తే తమకు తెలియజేయాలని బ్యాంకు మేనేజర్లను కోరారు.

పోలీసు విధులపై అవగాహన



తిరువూరు: పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లో ఆయుధాలు భద్రపరిచే గది, రికార్డు రూం, లాకప్, వైర్‌లెస్ సెట్ గురించి సీఐ గిరిబాబు వివరించారు. పోలీసులలో ఉండే కేడర్లు, వారి విధులపై, నేరాలు జరిగినప్పుడు పోలీసులు చేపట్టే దర్యాప్తు విధానాన్ని తెలిపారు. ప్రజలకు సేవలందించడంలో, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను వివరించారు. ఎస్‌ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



ఆగిరిపల్లి: మహిళల భద్రత, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం బుధవారం ఈదులగూడెంలో నిర్వహించారు. ఎస్ఐ శుభశేఖర్ మాట్లాడుతూ మహిళలను ఇబ్బందులకు గురి చేసే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా మహిళలు ఆపదలో ఉన్నప్పుడు 112కి ఫోన్ చేస్తే తక్షణం పోలీసులు సహాయం చేస్తారన్నారు స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగిపోవడంతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.